# గలుమ

పెద్ద దరువాజ ముందు 'గలుమ' (కడప) కానుకొని మెట్లమీద కూర్చొనుంది మల్లీశ్వరి.. బొంయ్‌మంటూ గాలి వీస్తోంది.. చెట్లన్నీ శివమెత్తినట్టూగుతున్నాయి. తలుపులు టపటపాకొట్టుకుంటున్నాయి. గాలికి దుమ్మొచ్చి మీద పడుతున్నా అక్కన్నుంచి కదలడం లేదు మల్లీశ్వరి. గాడ్పు దుమారంతో పాటు ఒక్కో చినుకుపడి వడగళ్ళూ పడి ఐదునిమిషాల్లో మళ్ళీ ప్రశాంతంగా మారింది వాతావరం, అయినా ఆమె అక్కన్నే ఉంది. బజారు దిక్కే చూస్తోంది. కొడుకొస్తాడని ఎదురు చూస్తోంది.

ఎంతోమంది స్త్రీలు భర్తలకోసం, తండ్రులకోసం, కొడుకుల కోసం 'గలమ'ల దగ్గర ఎదురుచూస్తుండటం గమనిస్తోందామె? ఇది తరతరాలుగా జరుగుతున్నట్టనిపిస్తోందామెకు

తనకు రాజమ్మ తెలుసు.. రాజమ్మ భర్త మస్కట్‌కు పోయాడు.. ఆమె పేరు మీద డబ్బు పంపిస్తున్నాడు.. అయితే ఆ డబ్బుకోసం గుంట నక్కల్లా ఎదురుచూస్తున్న బంధువులను, ఇతర్లను దగ్గరకు రానీయడం లేదు రాజమ్మ.. ఆమెపై నిందలు మోపారు.. భర్త ఊళ్ళోలేడని ఇతర్లతో అక్రమ సంబంధాలు పెట్టుకుందని అపనిందలేసారు.. భర్త ఎడబాటూ, ఇంటి పరిస్థితులను చక్కదిద్దడానికి పడుతున్న తపనతో నిందలూ మోయాల్సి వచ్చింది. ఆమెంతో శారీరక మానసిక వేదననుభవించినా నాలుగేళ్ళ తర్వాత తిరిగొచ్చిన భర్త నుండి తిరస్కారాన్నే చవిచూసింది.. మంది మాటలు విని ఆమెను వదిలేస్తానన్నాడు. అతనికి సర్దిచెప్పడానికి తాతలు దిగి రావాల్సి వచ్చింది..

'విదేశాలకెళ్ళి ఎంతో కష్టపడి డబ్బు సంపాదించుకొచ్చాడన్న పేరొచ్చింది. రాజమ్మ భర్తకు.. మరి రాజమ్మకేం మిగిలింది...?' తనను తానే ప్రశ్నించుకుంది మల్లీశ్వరి..

నర్సమ్మ భర్త అన్నల్లో కలిసిపోయాడు.. ఆమె ఇక్కడేమో నరకయాతన అనుభవించింది.. ఇరుగుపొరుగు వారామెను భయం భయంగా చూసేవారు.. ఆమె పిల్లల నదో విధంగా చూసేవారు.. కొందరైతే వెలి వేసినట్టే చూసేవారు.. మరో దిక్కు మాటి మాటికీ వస్తూ పోలీసులు వేధించడం.. ఇంకో దిక్కు ఆర్థిక దుస్థితి.. ఇవన్నీ ఆమె మానసిక స్థితినెంతో దిగజార్చాయి.. సంసారం నెగ్గుకు రావడానికి ఎంతో శ్రమపడాల్సి వచ్చింది.. ఆ తర్వాత నర్సమ్మ భర్తమరణించాడు..

'అతనికి పోరాటంలో మరణించిన వ్యక్తిగా చరిత్రయినా మిగిలింది.. ఎన్నో వేదనల కోర్చి సంసార

మీదుస్తున్న నర్సమ్మకేం మిగిలింది..?' ప్రశ్నించుకుంది మల్లీశ్వరి...

కార్యేషు దాసీ.. కరణేశు మంత్రీ...!

శయనేషు రంభా.. క్షమయా ధరిత్రీ..!

శ్లోకాన్ని జ్ఞాపకం చేసుకున్న మల్లీశ్వరి వైరాగ్యంగా నవ్వుకుంది.. 'తనలాంటి వాళ్ళు దాసీలూ.. రంభలూ మాత్రమే'.. అనుకుంది.

చిన్నతనంలో స్వతంత్రభావాలుండేవిమల్లీశ్వరికి.. వీరేశలింగం, రాజారామ్‌మోహన్‌రాయ్ లాంటి సంస్కర్తల గూర్చిచదువుకొని ఎంతో ఉత్తేజం పొందేది.. కాని, ఆమె కెంత చదువుకుందామనుకున్నా ఇంటి పరిస్థితులు ఆమె హెచ్. ఎస్.సి. పూర్తి చేయగానే మాన్పించ జేసాయి.. తండ్రి తెచ్చినసంబంధాని కొప్పుకొని పెళ్ళి చేసుకోక తప్పలేదు.

స్త్రీ బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలోకొడుకు సంరక్షణలో ఉండాలని తన చిన్నతనంలో తాత, పాఠశాలలో గురువు, తండ్రి ఇంట్లో ఆతర్వాత భర్త చెప్పిన మాటలను జ్ఞాపకం చేసుకుంది మల్లీశ్వరి...

'అంటే.. స్త్రీకి తనకంటూ ఏదీ ఉండకూడదన్నమాట అనుకుంది. 'గలుమ' లకే అంకితమై బతుకుతున్న స్త్రీల గూర్చి ఆలోచిస్తున్న మల్లీశ్వరికి తన జీవితం కళ్ళముందు కదిలింది. ఆమె మనసు. గత జీవితాన్ని నెమరు వేసుకుంది.

-------

"అమ్మా! అమ్మా! నాకో గౌనుకావాలి.." తల్లిమీద పడుతూ అడిగింది ఎనిమిదేళ్ళ మల్లీశ్వరి..

"మీ నాన్ననడుగు కొనిస్తాడు..." అందామె తల్లి..

"రాజేశ్వరిమంచిగౌను తొడుక్కొని వచ్చిందమ్మా...! నాకలాందిటేకావాలి.. నువ్వేకొనియ్యి.."

"నా దగ్గర డబ్బెక్కడుందమ్మా...! మీ నాన్నకు చెబితే కొనిస్తాడు.. నేను కూడ చెబుతానులే.."

ఏ చిన్న వస్తువును కొనియ్యమన్నా, ఏచిన్న అవసరానికైనా తల్లి తన తండ్రినే అడుగమంటుందని కోపంగా ఉంది... ఇప్పుడే కాదు ఇలా ఎన్నోసార్లు జరగడం మల్లీశ్వరికి నచ్చడంలేదు.

"ప్రతిదాని కెందుకమ్మా నాన్ననడుగు మంటావు..? నువ్వు కొనియ్యొచ్చుగదా...!"

"ఇంటి యజమాని ఆయన... నా దగ్గరేముంటాయి కొనివ్వడానికి.. మళ్ళీ మీ నాన్నకు తెలియకుండా కొనిస్తే కోపానికొస్తాడు.."

ఇలాంటి అనుభవాలనెన్నో చవిచూసిన మల్లీశ్వరి తన తల్లిలాంటిదానికి ఇంట్లో ఏ మాత్రం ఆర్థికపరమైన స్వాతంత్ర్యం లేదన్న విషయం గమనించింది. రాత్రింబవళ్ళు ఇంటి కోసమే రెక్కలు ముక్కలు చేసుకుంటున్న తల్లికా స్వతంత్ర మెందుకు లేదో ఆమె కర్థం కావడం లేదు..

ఏ చిన్న అవసరానికైనా పసిదైనమల్లీశ్వరి తండ్రి రాకకోసం ఎదురుచూడటం అలవాటు చేసుకుంది. మల్లీశ్వరి తల్లి భర్తకోసం ఎదురుచూస్తుంటే మల్లీశ్వరి 'గలుమ' దగ్గర తండ్రికోసం చూస్తుండేది.

హెచ్. ఎస్.సి. పూర్తయ్యేవరకు చదివించడమే అనవసరమనుకుంటూనే చదివించాడామె తండ్రి.. ఆమె ఇంకా చదువుకుంటానంటే తండ్రి వినలేదు..

" ఆడవాళ్లు చదువుకొని రాజ్యాలేలుతారా?" అన్నాడు.. "ఎందుకేలరు నాన్నా!..! ఇందిరాగాంధీ

ఏలడం లేదా..?''

''ఏలితే ఏలొచ్చు..కాని, నేనింక చదివించలేను..'' అన్నాడు..

ఇంటి పరిస్థితులు కూడా అనుకూలించలేదు.. పెళ్ళి సంబంధం కుదిరితే కొంతకట్నమిచ్చి పెళ్ళి చేశాడు..

మల్లీశ్వరికి తాను చదువుకున్న చదువు వంటింటికి పరిమితంకావడం ఇష్టంలేదు.. ఉద్యోగం చేయాలనుకుందామె... ఇదేమాట భర్తనడిగింది.

''ఆడవాళ్ళు ఉద్యోగం చేస్తూ ఊళ్ళేలుతారా...? ఇప్పటికే ఎంతో మంది మగవాళ్ళు నిరుద్యోగులుగా ఉన్నారు... నేను చేసే ఉద్యోగం చాలదా..? నీ కవసరం లేదు...'' అన్నాడు...

''ఈకాలంలో ఉద్యోగం చేయడానికి ఆడమగ భేద మెందుకండీ..? మీది చిన్న ఉద్యోగం.. భవిష్యత్తులో మనకు పిల్లలయి ఖర్చులు పెరిగితే ఈ జీతంతో నెగ్గుకు రావడం కష్టం కావచ్చు...''

''డబ్బు సరిపోకుంటే మరింత కష్టపడతాను.. ఇంకే విధంగా నైనా సంపాదిస్తాను.. నువ్వు ఉద్యోగం చేయడం నా కిష్టంలేదు.. చేసి కుటుంబాన్నుద్ధరించాల్సిన పనీలేదు...''

''ఎంతో మంది స్త్రీలిప్పుడు ఉద్యోగాలు చేస్తూనే ఉన్నారుకదా....!'' ''చేస్తే చేస్తున్నారు... మన కవసరం లేదు... ఆ ఆలోచనే నీ మనసులోకి రానియ్యకు...''

మల్లీశ్వరి జీవితం వంటగదికే అంకితమైంది... ఏ చిన్న అవసరానికయినా భర్తపై ఆధారపడటమే.. భర్త వచ్చేవరకు చూస్తుండటమే.. చీర కొనుక్కోవాలన్నా, ఇంట్లోకి అవసరమయ్యే ఏ చిన్నవస్తువునుకొనాలన్నా ఆమెకు స్వతంత్రం లేదు.. భర్తకు జీతమెంత వస్తుందో కూడా ఆమెకు తెలియదు.. తెలుసుకొని చేసేదేం లేకున్నా ఓ సారడిగితే

''ఆడవాళ్ళ కివన్నీ ఎందుకు...? జీతం పట్టింపులెందుకు...? కమ్మగ వండిపెడుతూ ఇంట్లో పడుండక అన్నీ అడగడమెందుకు...?'' అన్నాడు... జీతం గూర్చి చూచాయగా తెలిసినా తర్వాతెప్పుడూ ఆమె భర్తనుజీతం గూర్చి అడుగలేదు..

ఓసారి మిత్రురాలింట్లో ఫంక్షనైతే కొంత విలువైనకానుక తీసుకెళ్ళింది మల్లీశ్వరి. భర్తనడిగే సమయం లేదామెకు...

''పైస విలువ తెలియని బతుకెందుకు? మోసే వాడికెరుక కావడి బరువుని. నీకేం తెలుసు డబ్బు విలువ...? ఒక్క ఐదు రూపాయలైతే సంపాదించడం చేతగాదుకాని ఖర్చైతే చెయ్యొచ్చు...'' అన్నాడు.

ఆ మాటలకు చాలా నొచ్చుకుంది. మల్లీశ్వరి..

''మరి నేను ఉద్యోగ ప్రయత్నం చేస్తానంటే మీరే కదా వద్దన్నారు.''

''ఆడది తిరిగి చెడింది.. మగవాడు తిరుగక పోతే చెడుతాడంటారు.. స్త్రీ కడపలోపలుంటేనే అందం... ఉద్యోగం దేనికి...? ఉన్నదాన్ని సరిగా ఖర్చుచేస్తే చాలు...''

''ఉద్యోగం కోసం బయటకెళ్ళడం కూడా తప్పేనా మీ ఉద్దేశ్యంలో. ఉద్యోగం చేసే ఆడవాళ్ళ గూర్చి ఎవరెన్ని విధాలుగా మాట్లాడుకుంటారో నీకేం తెలుసు...? వాళ్ళెన్ని అవమానాలనెదుర్కొవాల్సి వస్తుందో ఇంట్లో కూచునే నీకే మర్థవుతుంది...''

ఓ దిక్కు బయటికెళ్ళడం గూర్చి విమర్శిస్తూనే ఇంట్లో ఉండడం గూర్చి చెప్పుతున్న భర్త మనస్తత్వం అర్థం కాలేదు మల్లీశ్వరికి...

''మీరు కూడా స్త్రీని గూర్చి నీచంగానే మాట్లాడుతారా...'?''

''నేనంటే...? చాలామంది మగవాళ్ళు.. బయటకెళ్ళిన స్త్రీకి విలువ తక్కువ...'' నిర్మోహమాటంగానే అన్నాడు.

''బయటకెళ్ళిన పురుషునికి విలువున్నప్పుడు స్త్రీకెందుకుండ గూడదు..?''

'' నీకే బాగా తెలివుందనుకుంటున్నావా...? ఎంతైనా స్త్రీ ఇంట్లో ఉంటేనే మంచిది...''

''అంటే మా కంటూ గౌరవమర్యాదలు, స్వంత వ్యక్తిత్వం ఏవీ అవసరం లేదా...?'' ''భర్తకున్న గౌరవ మర్యాదలు భార్యకుచెందవా...?''

''అవీ మీవే అయినప్పుడు మాకెందుకు చెందుతాయి.?''

''నువ్వే చదువుకున్న దాన్నని, తెలివిగా మాట్లాడుతున్నాననుకోకు...''

ఇలా ఎన్నోసార్లు జరిగింది.. స్త్రీకి ప్రత్యేకంగా వ్యక్తిత్వం ఉండాలంటే మల్లీశ్వరి భర్త ఒప్పుకోడు.. ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి ఇంట్లో లేకుంటే ఓ ఐదు నిమిషాలాలస్యమైనా పైపైకి లేస్తాడు.

''ఏం రాచకార్యాలు వెలుగబెడుతానని ఇండ్లవెంట తిరగడం...? నేను వచ్చేటైము కన్నా ఇంట్లో ఉండొచ్చుగా...'' అని కేకలేసాడు...

అదే తాను ఆలస్యంగా వచ్చినప్పుడడిగితే ''మగ వాడున్నప్పుడు సవాలక్ష పనులుంటాయి. ఆఫీసులో చచ్చిచచ్చి ఇంటికొస్తే ఎందు కాలస్యమైంది...? ఎక్కడికెళ్ళారని చెత్తప్రశ్నలు.. వెధవ వాగుడు..'' అని కసురుకుంటాడు.

'వంటపని, బండెడు ఇంటి చాకిరీ, పిల్లలపని, భర్తకన్నీ సమకూర్చిపెట్టడం, కుటుంబం కోసం సతమతం కావడం... ఈ పనులే స్త్రీ చేయాలనడం మళ్ళీ ఆ పనులకు ఏ మాత్రం ఖరీదులేదనడం మల్లీశ్వరికి వింతనిపిస్తుంది.. నిజానికి తానూ, తన లాంటివాళ్ళూ చేస్తున్న పనులకేం విలువ లేదా...? తాము కుటుంబ బాధ్యతలను తీసుకోనట్టేనా...? ఎన్నోసార్లు ప్రశ్నించుకుంది మల్లీశ్వరి.

అయినా గృహకృత్యాల్లో తీరిక లేకుండా, పాల్గొంటూ ఉంది.. భర్తరాకకోసం 'గలుమ' దగ్గర ఎదురుచూస్తేనే ఉంది. సాధారణంగా భర్త వచ్చేవరకు తినకుండా ఎదురుచూస్తునే ఉంది...

తన బతుకు వంటింటికే పరిమితమైనా కూతుర్నయినా బాగా చదివించి స్వతంత్రంగా బతికేట్టుచేయాలనుకుంది.. ఈ మధ్యనే కూతురు ఎస్. ఎస్. సి పూర్తి చేసింది.

''నేనుచేస్తున్నది చిన్న ఉద్యోగం.. దీంతో కొడుకునూ, కూతుర్నూ పెద్ద చదువులుచదివించడం నాతో కాని పని... అదెలాగూ ఆడపిల్ల కాబట్టి పెళ్ళి చేస్తే సరిపోతుంది.. బాబును బాగా చదివిద్దాం.. అమ్మాయి చదువింతటితో ఆపేద్దాం...'' అన్నాడు మల్లీశ్వరి భర్త...

ఆ మాటలు గుండెలు పిండినట్లున్నాయి మల్లీశ్వరికి.. తాను పొందలేని జీవితాన్ని కూతురుకైనా అందించాలనుకుంటే భర్త ఆమె చదువు నాపుతాననడం ఆమెకు బాధాకరంగా ఉంది... ఏదేమైనాకూతుర్ని చదివించడానికే నిర్ణయించుకుంది మల్లీశ్వరి...

''మన అబ్బాయి కంటే అమ్మాయే చదువులో చురుకైంది. దానికన్నిట్లో ఫస్టుమార్కులే... పోగా అబ్బాయి పెద్దవాడు... మీరన్నట్టు ఒకరికి పెళ్ళిచేయడం తప్పనిసరంటే వాడికి పెళ్ళి చేసి అమ్మాయిని చదివిద్దాం...''

మల్లీశ్వరి మాటలువిని మండిపడ్డాడామె భర్త...

''అమ్మాయి హుషారైతే అదెవరికక్కర కొస్తుంది...? ఎంత చదివించినా పెళ్ళై తే చేయాలికదా..? చదువు పెరిగితే అంతకు తగ్గ వరుడు దొరకడం కష్టమవుతుంది... కట్నం కూడా భారీగా ఇవ్వాల్సి వస్తుంద... ఇప్పుడైనా, అప్పుడైనా కట్నమెలాగూ తప్పదు కాబట్టి దానిమీద మరింత ఖర్చు చేయడం దేనికి...?'' అన్నాడు...

''మీరు స్త్రీకి పెళ్ళే సర్వస్వమైనట్టు, పెళ్లికోసమే మొహం వాచున్నట్టు చెబుతున్నారు... మీరెన్నైనా చెప్పండి. అమ్మాయిని చదివించడమే.. కట్నమివ్వలేకపోవడం వల్ల పెళ్ళి కాకపోతే కాక పోనివ్వండి... దానికి చదువంటే ప్రాణం..'' అంది మల్లీశ్వరి...

ఆమె కూతురు కూడా చదువుకుంటాననే పట్టుపట్టింది... ఇక చదివించక తప్పలేదు మల్లీశ్వరి భర్తకు.

కొడుకునెంతో ప్రేమగా పెంచుకుంది మల్లీశ్వరి... అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అతనిలో పురుషాహంకారం చోటు చేసుకోవడం గమనిస్తూనే ఉంది...

ఓ సారి మల్లీశ్వరి స్నేహితురాలున్న సమయంలో '' ఏందే అమ్మా...?'' అని పిలిచాడు ఆమె కొడుకు.

''అలా పిలుస్తున్నాడేంటీ...?'' అంది రాజేశ్వరి...

ఆ పిలుపులో తప్పేముందో మల్లీశ్వరికర్థం కాలేదు... అదే ప్రశ్న మిత్రురాలి నడిగింది.

''వాళ్ళ నాన్నను ఏరా నాన్నా అంటే తెగ సంతోషపడి పోతాడా...?'' అంది రాజేశ్వరి...

అప్పుడర్థమైంది అందులో ఏముందో మల్లీశ్వరికి... కాని, ఆమె ఎంత ప్రయత్నించినా కొడుకులో తండ్రి వారసత్వంగా వచ్చిన పురుషాంకారం పెరుగుతుంటే నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది మల్లీశ్వరి...

ఆమె కొడుకు అతికష్టంగా డిగ్రీ పూర్తిచేసాడు.. మల్లీశ్వరి భర్త వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని కొడుకును ఉద్యోగంలో పెట్టించాడు... పెళ్ళి చేసారు. కోడలు పరిస్థితి కూడా ఇంచుమించుగా తన పరిస్థితిలాగే ఉండటం గమనిస్తోంది మల్లీశ్వరి..

కాలేజీ చదువుతున్న మల్లీశ్వరి కూతురు స్త్రీవాద ఉద్యమాలతో సంబంధాలు పెట్టుకుంది... తాను బతుకుతున్న బతుకును గూర్చి విడమర్చి చెబుతున్న కూతురును ఆ ఉద్యమాలతో సంబంధాలు వదులుకోమని చెప్పడానికి మనసొప్పడం లేదు .

''అమ్మా! ఈ సమాజంలో స్త్రీ మహా అయితే వీరమాతో, వీరపత్నో, విప్లవమాతో, విప్లవ పత్నో అవుతుంది... ఆమె కంటూ స్వంత వ్యక్తిత్వముండే సంఘటనలు చాలా తక్కువ... తాను నవమాసాలు మోసి కనిపెంచినపిల్లల తల్లి పేరును ఎక్కడా అడుగరు... ఏ విషయంలో పేరొచ్చినా పురుషుడిదే వస్తుంది... విప్లవ మేధావులనుకుంటున్న వాళ్ళ కుటుంబాల్లోనూ ఇది తప్పడం లేదు... స్త్రీల పని చాలావరకు ఇప్పటికీ 'గలుమ' ల దగ్గర ఎదురుచూడటమే అవుతోంది...''

కూతురన్న మాటలను మననం చేసుకుంటూ తన జీవితాన్ని, తనలాంటి వాళ్ళ జీవితాలను జ్ఞాపకం చేసుకున్న మల్లీశ్వరి మనసు భారమైంది.

కోడల్ని తీసుకురావడానికి అత్తవారింటికెళ్ళిన కొడుకుకోసం ఎదురుచూస్తోంది మల్లీశ్వరి. జోరుగా గాలి వీచడం మళ్ళీ మొదలైంది. ఆమె మనసంతా అల్లకల్లోలంగా ఉంది. బయటకెళ్ళిన కూతురొచ్చి తల్లిని లోపలికి తీసుకెళ్ళింది. ''అమ్మా! పైటలను తగలెయ్యడమే కాదు... గలుమలనూ తగలెయ్యాలి... ఈ మధ్యకూతురన్న మాటలే మల్లీశ్వరి చెవుల్లో గింగురుమంటున్నాయి...

*ఆదివారం ఆంధ్రజ్యోతి 12-3-95*